క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ ఎం.విజయ్‌భాస్కర్ తెలిపారు. 44 నెంబర్ ఫీడర్ పరిధిలో పార్సిగుట్ట, గ్రేవ్‌యార్డ్ తదితర ప్రాంతాల్లో 9.30 నుంచి 12 గంటల వరకు.. సాయిబాబా దేవాలయం ఫీడర్ పరిధిలో బతుకమ్మకుంట, ఆంధ్రాబ్యాంక్, సీతా కాలనీ పార్క్, హనుమంతరావు లేన్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

జాతీయ సదస్సు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో రీసెర్చ్ ట్రెండ్స్ ఇన్ హిస్టారికల్ రీసెర్చ్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. విభాగం హెడ్ ప్రొ.అంజయ్య అధ్యక్షత వహించగా వీసీ ప్రొ.రవీందర్, ఓయూ మాజీ వీసీ సులేమాన్ సిద్ధిఖీ, అలహాబాద్ వర్సిటీ మాజీ వీసీ ప్రొ.రతన్‌లాల్ హంగ్లు ముఖ్య అతిథులుగా హాజరై సదస్సును ప్రారంభించి ప్రసంగించారు.

నేడు, రేపు టీఎస్-సెట్

ఉస్మానియా యూనివర్సిటీ: అధ్యాపక ఉద్యోగాల అర్హత పరీక్ష తెలంగాణ స్టేట్ ఎల్జిబిలిటీ టెస్ట్(టీఎస్‌సెట్-2022) నేడు, రేపు జరగనుంది. ఈ నెల 13న జరగాల్సిన పరీక్షను 17కు వాయిదా వేసిన విషయం విదితమే. పరీక్షా కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని అధికారులు సూచించారు.

ప్రచురించే ముందు వార్తలను సరిచూసుకోవాలి



మాట్లాడుతున్న ఫ్రాంకీ స్టార్క్స్

ఉస్మానియా యూనివర్సిటీ: వార్తలను ప్రచురించే ముందు సరిచూసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం ఓయూ జర్నలిజం విభాగం, హైదరాబాద్ ఫ్యాక్ట్‌చెక్-2023 ఆధ్వర్యంలో ఉర్దూ జర్నలిస్టులు తప్పుడు సమాచారాన్ని ఎదుర్కోవడం అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. కార్యక్రమానికి జర్నలిజం విభాగం హెడ్ ప్రొ.స్టీవెన్‌సన్ అధ్యక్షత వహించగా అమెరికా రాయబార కార్యాలయం ఉన్నతాధికారి ఫ్రాంకీ స్టార్క్స్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. డీసీపీ స్నేహా మెహ్రా, వీసీ ప్రొ.రవీదర్ మాట్లాడారు.

ఓయూ ఇంజనీరింగ్ కాలేజీకి ఐఎస్ఓ గుర్తింపు



వీసీ నుంచి ఐఎస్ఓ సర్టిఫికెట్ అందుకుంటున్న ప్రొ.రామ్ వెంకటేష్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజీకి తొలి సారిగా ఐదు ఐఎస్ఓ (ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) గుర్తింపు సర్టిఫికెట్లు లభించినట్లు ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ తెలిపారు. సోమవారం వీసీ లార్జ్‌లో (నివాసం) వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందుకున్నారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన బోధనకు పలు ఇంజనీరింగ్ విభాగాలతో పాటు బాల, బాలికల హాస్టల్స్, కాలేజీ క్యాంటీన్‌లో రుచి, నాణ్యతతో కూడిన పోషక ఆహారం అందించినందుకు కళాశాల ఆవరణలో పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని ఐఎస్ఓ గుర్తింపు లభించినట్లు వివరించారు.

ఓయూ స్విమ్మింగ్‌పూల్ పునఃప్రారంభం



స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభించిస్తున్న వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో స్విమ్మింగ్‌పూల్, బ్యాడ్మింటన్ కోర్టును సోమవారం వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణలతో కలిసి పునఃప్రారంభించారు. కరోనా కారణంగా మూడేళ్లుగా స్విమ్మింగ్‌పూల్‌ను మూసేసిన విషయం విదితమే. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు సాయంత్రం 3.30 నుంచి 5.40 వరకు మూడు బ్యాచ్‌లు ఉంటాయని మహిళలకు ప్రత్యేకంగా ఉదయం 9.20 నుంచి 10 గంటలకు సమయాన్ని నిర్ణయించారు. ప్రతి బ్యాక్‌కు 40 నిమిషాల సమయాన్ని కేటాయించినట్లు ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్‌కుమార్ వివరించారు. ఓయూ విద్యార్థులకు నెలకు రూ.100, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు రూ.750, బయటి వ్యక్తులకు రూ.2000, అనుబంధ కాలేజీల అభ్యర్థులకు రూ.750గా నిర్ణయించారు.

కల్యాణలక్ష్మితో పేదల ఇళ్లలో కాంతులు



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కాచిగూడ: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో ప్రభుత్వం పేదల ఇళ్లలో కాంతులు నింపుతోందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం కాచిగూడకు చెందిన ఐశ్వర్యకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కును బీఆర్ఎస్ సీనియర్ నేత బి.కృష్ణాగౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఈ పథకాలు అమలు చేస్తున్నారన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

అంబర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం రాత్రి అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు రాగుల ప్రవీణ్‌పటేల్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కాలేరు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి సముచిత గౌరవం కల్పిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో శ్రీకాంత్, వెంకటేష్, ప్రణయ్, రత్నకుమార్, గణేష్, యాదయ్య తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ నిర్వహించారు. 333 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 284 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ మహంకాళి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ సి.కె.శంకర్ రావు, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ స్లిప్పులు అందజేశారు. సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ రమణారెడ్డి, చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, ముషీరాబాద్ సీఐ జహంగీర్‌యాదవ్ పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహించారు.



ఓటర్లకు స్లిప్పులు అందజేస్తున్న నాయకులు

'ఏవీఎన్ రెడ్డి గెలుపు తథ్యం'

కాచిగూడ: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి గెలుపు తథ్యమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సోమవారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ వద్ద కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల పోలింగ్ సరళి బీజేపీ బలపర్చిన అభ్యర్థికి అనుకూలంగా ఉందన్నారు. ఉపాధ్యాయులను విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఈ ఎన్నిక ద్వారా తగిన గుణపాఠం చెప్పనున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వనం రమేష్, బి.సంతోష్, సుభాష్‌పటేల్, అరవింద్, బల్వీర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లకు నివాళి



మొల్ల విగ్రహానికి నివాళులర్పించిన మంత్రి తలసాని తదితరులు

కవాడిగూడ: సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన కవయిత్రి మొల్ల అని పలువురు వక్తలు పేర్కొన్నారు. కవయిత్రి మొల్ల జయంతిని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్రీయ కుమ్మర సంఘం ఆధ్వర్యంలో సోమవారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆమె విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, తెలంగాణ రాష్ట్రీయ కుమ్మరి సంఘం గౌరవ అధ్యక్షుడు బండారి భిక్షపతి, అధ్యక్షుడు దర్పల్లి మహేందర్, ప్రధాన కార్యదర్శి రామస్‌కోల్ వీరేశం, కోశాధికారి ముప్పల అశోక్‌లతో పాటు కుమ్మర సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు. మొల్ల జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కుమ్మరి సంఘం నేతలు కోరారు.

'రాజ్యాధికార సాధనకు బహుజనులు ఉద్యమించాలి'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బహుజనులు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని ఆల్ ఇండియా దళిత సేన చైర్మన్ జే.బి.రాజు పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ప్రజా సైన్యం పార్టీ ఆవిర్భావ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జే.బి.రాజు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా అణగారిన వర్గాల హక్కులు అమలు కావడం లేదన్నారు. రాజ్యాధికారం దక్కినప్పుడే వారికి ఆత్మగౌరవం లభిస్తుందన్నారు. ప్రజా సైన్యం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వేములవాడ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. దేశంలో అన్ని కులాల వారికి సమాన హక్కులు లభించాలని, అందు కోసం ఉద్యమం చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ ఎవరితో పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి డాక్టర్ మంగారి రాజేందర్, శాస్త్రవేత్త డాక్టర్ గోలి మోహన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాస్, భారతీయ కార్మిక సంఘాల సమైక్య సమితి అధ్యక్షుడు గొల్లపల్లి దయానందరావు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

చిక్కడపల్లి: బాలిక అదృశ్యమైన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. చిక్కడపల్లిలోని అరోరా కాలేజ్ సమీపంలో నివసించే తాడూరి లక్ష్మి కుమార్తె హర్షిత(17) సోమవారం ఉదయం 7 గంటలకు ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ కిరణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు 8712660160, 8712660164లో సమాచారం అందించాలని కోరారు.

గూడ్స్ రైలులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కాచిగూడ: కాచిగూడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం-2పై ఉన్న గూడ్స్ రైల్లో గుర్తుతెలియని వ్యక్తి (60) మృతదేహం లభ్యమైంది. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీరాంరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. రామగుండం నుంచి బల్లారి వెళ్లే గూడ్స్ రైలులో విద్యుత్ షాక్‌తో చనిపోయిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉంది. మృతుడి ఒంటిపై బ్లూకలర్ టీ షర్టు, స్కై బ్లూకలర్ ప్యాంట్ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు సాహిత్యంలో రుద్రకవి కావ్యాలకు ప్రత్యేకత

చిక్కడపల్లి: తెలుగు సాహిత్యంలో కందుకూరి రుద్రకవి రచించిన కావ్యాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయని రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. సోమవారం త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో శతాబ్ది క్రితం మహనీయులు యాదిలో పేరిట జరుగుతున్న కార్యక్రమంలో శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుద్రకవి కావ్యరచనలు సమాజాన్ని ఎంతో ప్రభావితం చేశాయన్నారు. కార్యక్రమంలో సాహితీకిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, బాలసాహిత్య రచయిత చొక్కాపు రమణ, సికా సంయుక్త కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్‌గుప్తా, జనార్ధనమూర్తి

జలమండలి నిర్లక్ష్యం.. పార పట్టిన ట్రాఫిక్ కానిస్టేబుల్



మట్టికుప్పను చదును చేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ రవి

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని అడిక్‌మెట్ చౌరస్తాలో ఓ అపార్ట్‌మెంట్‌కు చెందిన తాగునీరు, డ్రైనేజీ పైపులైన్‌ను రెండు రోజుల క్రితం జలమండలి అధికారులు మ్యాన్‌హోల్‌లో కలిపారు. పనులు ముగిసిన తర్వాత దానిపై మట్టిని చదును చేయకపోవడంతో పైపులైన్ పగిలిపోయి రోడ్డుపై నీరు పారుతోంది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. అయితే అక్కడే ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న నల్లకుంట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ రవి రెండు గంటల పాటు శ్రమించి మట్టిని చదును చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ చొరవను వాహనదారులు మెచ్చుకున్నారు.

ప్రశ్న పత్రాల గోప్యతలో అలసత్వం తగదు

ముషీరాబాద్: లక్షలాది మంది నిరుద్యోగుల జీవితంతో ముడిపడి ఉన్న పరీక్ష పత్రాల లీక్ వ్యవహారంలో ప్రమేయం ఉన్న అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని భారతీయ జనతా యువ మోర్చా సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ కోరారు. వందల మంది యువకులు, విద్యార్థుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న రాష్ట్రంలో సకాలంలో ఉద్యోగ ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్ ఇవ్వడంలో విఫలమైన టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తప్పుడు ప్రశ్నలు, తప్పుడు నిబంధనలతో గ్రామీణ విద్యార్థులు, అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్న పత్రాల గోప్యత విషయంలో అలసత్వం ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాల ఫలితంగా వచ్చిన నోటిఫికేషన్ల ప్రక్రియలో పరీక్ష పత్రాలు లీక్ అవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. బోర్డు తీరు చూస్తుంటే గతంలో జరిగిన పరీక్షల మీద సైతం అనుమానం కలుగుతోందన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

చిక్కడపల్లి: బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రజాదరణ పొందే కార్యక్రమాలు చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సోమవారం గాంధీనగర్ డివిజన్ పరిధిలో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లు విజయవంతమైన సందర్భంగా శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలను స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్‌తో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్పొరేటర్ పావని మాట్లాడుతూ.. డివిజన్ వ్యాప్తంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లతో బీఆర్ఎస్ పార్టీ నాయకుల్లో భయం మొదలైందన్నారు. బీజేపీ కార్నర్ మీటింగ్‌లకు ప్రజలు పెద్ద ఎత్తున రావడంతోనే బీఆర్ఎస్ పట్ల వ్యతిరేకత ఉందనే విషయం స్పష్టమైందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వినయ్ కుమార్, రత్నసాయిచంద్, ఉమేష్, నర్సింగ్‌రావు, సురేందర్, నర్సింహ, సురేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



ప్రజా గోస-బీజేపీ భరోసా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ లక్ష్మణ్, కార్పొరేటర్ పావని

అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం

సికింద్రాబాద్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తమ సత్తాను చాటుతున్నారని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీతాఫల్‌మండిలో సోమవారం బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సరోజిని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సికింద్రాబాద్‌లో సామాజిక, ఆర్థిక రాజకీయ రంగాల్లో మహిళలకు ప్రోత్సాహాన్ని కల్పిస్తున్నామన్నారు. మహిళా అభ్యున్నతి, సాధికారతకు తాము కల్పిస్తున్న ప్రాధాన్యతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమాన్ ఆలయంలో ఉత్సవాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణమూర్తి తదితరులు

కవాడిగూడ: పద్మశాలి కాలనీలో ప్రసిద్ధిగాంచిన సంజీవ హనుమాన్ దేవాలయ ఉత్సవాలను మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి బింగి నవీన్ తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 17 వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు మచ్చేందర్, కృష్ణ, సలహాదారులు పుండరీకం, మార్కండేయ, కోశాధికారి వెంకటేష్, సభ్యులు గడ్డం నవీన్, గుండు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ రాష్ట్ర స్థాపనకు పోరాడతాం

ఎమ్మెల్యే రాజాసింగ్



హిందూ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కాచిగూడ: హిందూ రాష్ట్ర స్థాపన కోసం ఊపిరి ఉన్నంత వరకు పోరాడతానని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. హిందూ జన జాగృతి సమితి ఆధ్వర్యంలో కాచిగూడలోని నృపతుంగ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హిందూ సమ్మేళనం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణలో ధర్మ పోరాటం చేసిన వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తాను ప్రత్యక్షంగా అనుభవించానన్నారు. ఎవరు ఎంత ఇబ్బంది పెట్టినా హిందుత్వ కార్యాన్ని ఆపొద్దని సూచించారు. హిందూ జన జాగృతి సమితి నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సమావేశానికి గత 10 సంవత్సరాలుగా హాజరవుతున్నానని, అక్కడ గురూజీ 10 సంవత్సరాల క్రితమే హిందూ రాష్ట్రం కచ్చితంగా వస్తుందని చెప్పారన్నారు. కార్యక్రమంలో హిందూ జన జాగృతి సమితి ప్రతినిధులు రమేష్ షిండే, చేతన్ గాడి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు



పైపులైన్ మరమ్మతులను పర్యవేక్షిస్తున్న భీష్మదేవ్

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లో తాగునీటి పైపులైన్ పగిలిపోవడంతో కొంత కాలంగా నీరు వృధాగా పోతోంది. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాదయాత్ర సందర్భంగా స్థానికులు సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కరించాలని జలమండలి అధికారులను ఆదేశించగా సోమవారం మరమ్మతులు చేపట్టారు. కాచిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాండురంగ, క్రాంతి, మహేందర్, రామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన సేవా సమితి ఎన్నిక నిలిపివేయాలని వినతి

అంబర్‌పేట: అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి కార్యవర్గానికి జరుగుతున్న ఎన్నికలను నిలిపివేయాలని స్థానిక బీఆర్ఎస్ నాయకులు జీవన్‌గౌడ్, జనార్ధన్‌లు దేవాదాయశాఖ అడిషనల్ కమీషనర్ కృష్ణవేణికి వినతి పత్రం ఇచ్చారు. బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ ఎడ్ల సుధాకర్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. దేవస్థాన సేవా సమితి పరిధిలో ఉన్న ఆలయాలు దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నాయని ఎన్నికల్లో జోక్యం చేసుకోవాలని ఆమెను కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఏప్రిల్ 3న ధర్నాను విజయవంతం చేయండి



సంగ్రామ యాత్రలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత సాధనకై మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఏప్రిల్ 3న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ ఆధ్వర్యంలో మాదిగల సంగ్రామ యాత్ర నిర్వహించారు. రాంనగర్ డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ బస్తీ, సంజయ్‌నగర్ బస్తీ, పాలమూరు బస్తీలో యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు గతంలో మద్దతు తెలిపిన బీజేపీ ప్రస్తుతం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉండి హామీని నెరవేర్చకుండా మాదిగలను మోసం చేస్తుందన్నారు. మాదిగలంతా ఏప్రిల్ 3న నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యడవెల్లి యాదయ్య, శ్యామ్‌రావు, దుర్గాప్రసాద్, దాసరి శ్రీనాథ్, రమేష్, బడుగుల బాలకృష్ణ, కుమర్తి శివ, నాగేందర్, ధన్‌రాజ్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణమాదిగ ఆధ్వర్యంలో..

నల్లకుంట: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధనకై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు బడుగుల బాలకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగ సంగ్రామ యాత్ర సోమవారం నల్లకుంట గాంధీనగర్ లంక బస్తీలో ముగిసింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. ఏప్రిల్ 3న బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట చేపడుతున్న మహాధర్నాకు అన్ని బస్తీల నుంచి మాదిగ, మాదిగ ఉపకులాల వారు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టకుంటే బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలను మాదిగలు నిలదీయాలని పిలుపునిచ్చారు.

'రాజకీయ లబ్ధికే ఎమ్మెల్సీ కవితపై కేసులు'



ర్యాలీ నిర్వహిసున్న బీఆర్ఎస్ నాయకులు

కవాడిగూడ: రాజకీయంగా ఎదుర్కోలేకే కేంద్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితపై అక్రమంగా లిక్కర్ స్కామ్ కేసు నమోదు చేసిందని బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ అన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవితపై ఈడీ కేసులను వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహించారు. వీ ఆర్ విత్ యూ అంటూ బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బాకారం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జైసింహ మాట్లాడుతూ.. రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. తెలంగాణ బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో రహీం, ఉమాకాంత్, మహ్మద్ ఆలీ, మక్బుల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



అడిక్‌మెట్ డివిజన్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు సోమవారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, యువ నాయకుడు జైసింహ, మాజీ కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



పండ్లు పంపిణీ చేస్తున్న ముఠా జైసింహ, శ్రీనివాస్‌గుప్తా తదితరులు

శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో..

చిక్కడపల్లి: బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కవిత జన్మదినం సందర్భంగా సోమవారం వై జంక్షన్ చౌరస్తా వద్ద పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు కేక్ కట్ చేశారు. మాజీ కార్పొరేటర్ ముఠా పద్మానరేశ్, ముఠా నరేశ్, ఎంబీ కృష్ణ, సంతోష్‌కుమార్, శ్రీకాంత్, ఆకుల శ్రీనివాస్, ఎం.భాస్కర్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



శివముదిరాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ